

కథ 1999

12

# బారతం బొమ్మలు

గోపిని కరుణాకర్

చీకటింట చందమామ లేదు. సుక్కలాకాశం మిణుకు మిణుకుమంటా వుండాది. గుడ్డి సుక్క నడిమింటికొచ్చింది. గాలికి పలవరేణి మాను వూగింది. లోకానికి ఇచ్చిత్తరంగా చిలకకి కాకిపిల్ల పుట్టింది. దాని మొగుడు మద్దిస్తం పెట్టించినాడు.

ఎక్కడెక్కడ నుంచో వచ్చిన చిలకలన్నీ గుంపులు గుంపులుగా కొమ్మల మింద వాలుండాయి. పెంటిచిలక, కాకిపిల్ల ఎట్లా పుట్టిందో కత చెప్పడం ఆరంభించింది.

శాన్నాళ్ల కింద నేను, నా మొగుడు గువ్వల చెరువు కనానికి మేతకు పొయినాం. నేరేడు పొండ్ల కాలం. కడుపు నిండా కావాల్సినన్ని పొండ్లు తిన్నాం. రెండుబార్ల పొద్దును బుజాన ఏసుకొని తిరిగి వస్తా వుండాము. మమ్మల్ని డేగ తరుముకొనింది. పాణాలను రెక్కల్లో పెట్టుకొని ఎగరతావుండాము. పిడుగు పన్నెట్టు నా మింద పడింది.

కిక్కిరిస్తా రెక్కల్ని రెపరెపా ఇదిలించి ఇనప కాళ్లతో తన్నింది. రెక్కకు పెద్ద దెబ్బ తగిలి ఎగరలేక పొయినాను. పట్టు తప్పింది. గాలిలో గిరగిరా తిరగతా పెద్ద మర్రిచెట్టు కొమ్మల్లోంచి జారి గడ్డిపొదల్లో పడి పొయినాను. అంతే మల్ల ఏమి జరిగిందో నాకు తెలవదు. సోదీనం తప్పినాను. మెలకువ వచ్చి చూసే సరికి 'బొరోమని' వాన కురుస్తా వుండాది.

ఆకుల సందుల్లోంచి చినుకులు పడి వొళ్లంతా తడిసింది. రెక్క ఇరిగి పచ్చిపుండైంది. కదలలేను, మెదలలేను. ఆ మర్రిచెట్టు ఏ కాలంనాటిదో నరమాను. పెద్దపెద్ద పురులు తిరిగిన ఊడల్ని దింపింది. ఆ చెట్టు కిందకు తాత మనవడు గొడ్లను తోలుకొని వచ్చినారు.

చిదుగులేరి మంట పెట్టినారు. 'చిటపటా చిటపటా' మంట నాలికలు కోస్తా వుండాది. ఎచ్చగా మంట తగిలేగుందికే పాణం లేసొచ్చింది. ముసిలోడు కొరివితో ఎర్రెర్రని నిప్పుల్ని పక్కకు తోసినాడు. పై గుడ్డలో మూట గట్టుకున్న గొటికి గెడ్డలను నిప్పుల మింద పోసినాడు.

పుల్ల తీసుకుని గెడ్డల్ని కిందకూ మిందకూ పొల్లిస్తా వుండాడు. మనవడు వులింజి పొండ్లను బొక్కలాడతా వుండాడు.

గొడ్లు మర్రిచెట్టు కింద నిలబడి నెమరేసుకొంటా వుండాయి. పొదుగును గుద్దిగుద్ది పాలు తాగతా వుంటే, దూడను మదిగారంగా నాకతా వుండాది కర్రావు. దేశిపు గిత్త ఒగటి నేలను కుళ్లగించి కొమ్ముల్ని ఇదిలించింది.

పక్కంగా వుడికిన గెడ్డల్ని పొట్టు వొలిసి మనవడి కిచ్చినాడు. కొరివితో తుంట బీడిని ముట్టించుకొని చిదుగుల్ని ఎగదోసినాడు. ఆరిపోయిన మంట మల్లా రగులుకొనింది. పుల్లల్ని ఎగదోసేటప్పుడు ముసిలోడి మణికట్టు మింద వుండే పచ్చబొట్టును చూసినాడు మనవడు.

"ఎవురిది తాత ఈ బొమ్మ?" తాత చేతిని తీసుకొని బొమ్మను చూస్తా అడిగినాడు.

"ఈ బొమ్మ ఒగ రాజకుమార్తిది. అదంతా పెద్ద కతలే," అన్నేడు.

"ఆ కత ఏందో చెప్పు తాత?" చేతిని కుదిలించి ముదిగారంగ అడిగినాడు.

తాత కత ఎత్తుకొన్నేడు. ఇప్పటి కత కాదులే ఇది. నూనూగు మీసాల వయసప్పటి కత.

నాకు అప్పటికి పెండ్లి గూడా కాలేదు. పెద్దరెడ్డి దెగ్గిర జీతానికి వుంటిని. నేనంటే పెద్దరెడ్డికి బలే గురి వుండె. ఇప్పుడంటే ఇవి తోలుతిత్తులుగాని, అప్పుడు

నల్లంగా నిగనిగలాడతా వుండె. కండలు తిరిగిన వొళ్లు నాది. ఈగ వాలితే జారిపోతా వుండె.

ఏడు ముద్దల సంగటి ఒక్క ఏటుకు ఎగరేస్తా వుంటి. రెండు దుత్తల కల్లు తాగి తూలకుండా నడస్తా వుంటి. బుజమింద నొగను పెట్టుకోని ఎనకా ముందు సూడకుండా నిండుబండిని ఈడుసుకోని వచ్చేస్తా వుంటి. రెడ్డిది నూరెకరాల సేద్దిం గదా! వొంటి చేత్తో చుట్టేస్తా వుంటిని. మాదిగ చిన్నోడంటే గోలుకొండ అబ్బా అంటా వుండె.

సంకురాత్తిరి పోయిన మరుసటి దినం. బారతం బొమ్మలు తెచ్చేదానికి బండి కట్టుకొని నరసింగా పురానికి యలబారినాను. సిత్తూరు సీమలో శివరాత్తిరి పోయినాక పద్దెనిమిది దినాలు బారతం జరపతారు. పొగులు హరిదాసు కత చెపతాడు. రాతెరికి పొగులు దాసు చెప్పిన కతను కంగుంది కుప్పం ఆటోళ్లు ఆడతారు. ఈ బారతం జరిగే నెలా, రెండు నెలల ముందు నుంచి బారతం బొమ్మలను పల్లెపల్లెకు తిప్పు తారు.

"బారతం బొమ్మలంటె ఏంటివి తాత?" కతకు అడ్డుపడి అడిగినాడు మనవడు. ఆరిపోయిన తుంట బీడిని చెవులో చెక్కోని మల్లా కత చెప్పడం ఆరంభించి నాడు.

బారతం బొమ్మలంటే పంచపాండవులు, ద్రౌపతమ్మ, పోతురాజు బొమ్మలు. ఈ బొమ్మల్ని లక్క ఇంట్లో తగలబెడతారు. బారతం బొమ్మలు లేందే బారతాన్ని జరపరు. వాటిని ఎత్తుకొని పలకలు కొడతా, కొమ్ములూదతా, పల్లెపల్లె బొమ్మల్ని తిప్పి వడ్లు, దుడ్లు వసూలు చేస్తారు. అట్లా పోగైన వడ్లను, దుడ్లను బార తానికి కరుజు చేస్తారు. బారతం బొమ్మలు అరవదేశం నుండి నరసింగాపురానికి వస్తాయి.

ఇప్పుడంటే బొస్సులు, లారీలు వుండాయిగాని అప్పుడు లేవుగదా! రైలు గూడా అప్పుడప్పుడే నడుస్తా వుండాది. తెల్లోల్లే రాజ్జిమేలతా వుండిరి. సద్దన్నం కట్టు కొని రెండు దినాలు నడిసి సామి కొండకు పోతావున్నేరు.

గప్పుడుగప్పుడని దేసి పెద్దులు పరిగెత్తతా వుండాయి. గణగణా గంటలు మోత గరగరమని కంక ర్రోడ్డు మింద టేకుబండి దొల్లుకొని పోతా వుండాది.

బీడీ ముట్టించినాను. బొంతను తీసి కూసుకు కట్టినాను. బుజమింద వుండే పై గుడ్డను రుమాలు చుట్టినాను. పోయిన ఉగాదికి రెడ్డి తెచ్చిచ్చిన ముతక పంచెను గోసిపోసి కట్టుకొన్నేను. వొంటి మీద చొక్కాయి లేదు. ఎవరో మారాజులు ఏసుకొంటా వుండిరి.

నాకు తెలిసి వంటి మిందకు వయసొచ్చేంత వరకూ గోసిపాతే పెడతా వుండే మాయమ్మ. వయసుకు వచ్చినాక కోకను రెండుగా చింపి ఇస్తే ఒకటి మార్చి ఒకటి ముడ్డికి అడ్డంగా కట్టుకొంటా వుంటిని. వొళ్లు బిత్తలగానే వుండేది.

ఇప్పుడు మాదిరి అప్పుడు జుట్టు కత్తిరించుకొనేది లేదు. జుట్టును ముచ్చెనగుంతన ముడేసుకొంటా వుండిరి. మంగలోడు మాదిగ పల్లెకు రాడు. మాదిగోడికి గడ్డం గీసిన కత్తితో పై జాతోళ్లు గడ్డం గీసుకోరు.

అందులోనూ మనది మంగలోల్ల కంటే తక్కువ జాతి గదా! మంగలోల్లు గూడా బెట్టు చేస్తా వుండిరి. లచ్చుం మామని మా మేనమామ ఒకాయన వుండె. ఆయనే అందరికీ గడ్డం గీస్తా వుండె.

నావి బారెడు ఎంటికలు నల్లగా నిగనిగలాడతా వుండె. కుంకుడుకాయలతో తలకు నీళ్లు పోసుకొన్నేను. మెడ మింద ముడేసి వదిలేసినాను. గాలికి పాయలు పాయలుగా యీపుమింద జుట్టు బుసకొడతా వుండాది. కండ్లకు కాటిక దిద్దినాను. మొగలిపూల సుంకును వంటికి పూసుకొన్నేను.

చెట్టంత మనిషిని గదా! సోకు చేసుకొన్నేనంటే ఆడోళ్ల కన్నులన్నీ నా వొంటిమిందనే వుండయి. కన్నార్ప కుండా చూస్తా వుండిరి.

(ముసిముసి నవ్వుకు ముసిలోడి బుగ్గలు సొట్టలు పడినాయి.)

చలికాలం. పొద్దు నెత్తిమిందకు వచ్చినా సలిసలి గానే వుండాది. సద్ద చేన్లు కోసి గూళ్లు ఏసినారు. సద్ద కొర్రులకు అనప, అలసంద తీగలు గుములు గుము లుగా అల్లుకోనుండాయి. కందిచేను సీతాకోకచిలకల్ని పూసింది. ఎగరతా వాలతా వుండాయి.

ఆరిక మళ్లల్లో కలుపు తీస్తా ఆడోళ్లు గొంతులు కలిపి కోగిలలు కూసినట్టు పాటలు పాడతా వుండారు. ఉదేమానిక్కం మిందగా సట్టేవారిపాలెం దాటుకొని బాకరపేటకు చేరినాను. నాయనోరు సత్రం కాడ బండి నిలిపి ఎద్దలకు గడ్డి ఏసినాను. సద్దన్నం తిని పై గుడ్డ పరిసి కొంచేపు నడుం వాల్చినాను.

నిద్రపోయి లేసేగుందికే సత్రం కాడ జనం గుంపులు గుంపులుగా వుండారు. పిల్లాజెల్లా కాసర బీసరని అరస్తా ఆలగోడు బాలగోడుగా వుండాది. బాకరపేట నుండి ఆరేపల్లి రంగంపేట వరకు పదైదు మైళ్లు పొడుగునా అడివి. ఇప్పుడంటే ముండ్ల పొదలు, కుందేలు పిల్లలు తప్పా ఇంగేమి లేవు. అప్పుడు ఎండ నేలమింద పడేదిగాదు. టేకు, మద్ది, బొమ్మచెట్లు ఆకా శానికి పెరిగి అడివికి గొడుగు పడతా వుండె. వానలు

పుంజిగా కురస్తావుండె. మనిషి ఎత్తు కాసి గెడ్డి చిక్కంగా కప్పుకోనుండె. పులులు, అడివి ఏనుగులు, ఎలుం గొడ్లు తిరగతా వుండె. జింకలు, దుప్పులు, మందలు మంద లుగా వుండె. అడవిలో బందిపోటు దొంగలు కూడా వుండిరి. ఒకరిద్దరు వొంటిగా అడవిలో పొయ్యే వాళ్లు గాదు. ఏప్పై, అరవైమంది గుంపులు కట్టి యల బారతా వుండిరి.

మొగోళ్లు దుడ్డుకట్టెలు, మచ్చు కొడవండ్లు చేతల్లో పట్టుకొని గుంపు సుట్టకారం నడస్తా వుండిరి. గుంపు మద్దెలో పిల్లాపాపల్ని సంక నెత్తుకుని ఆడోళ్లు అరువులు చేస్తా నడస్తా వుండిరి. నీళ్లు తాపి ఎద్దల్ని బండికి కట్టినాను. ఎగిసి నొగమింద కుచ్చొని అదిలించి నాను.

గుర్రాలు మాదిర్తో ఎద్దులు గప్పుడుగప్పుడని పరి గెత్తెతా వుండాయి.

గణగణమని గంటల మోత.

టేకుబండి గరగరమని గాలిలో తేలిపోతా వుండాది. నీళ్లు పట్టి నొగకు కట్టిన సొరకాయ బుర్ర వూయలూగతాంది.

నరిసింగాపురం చేరే గుందికే పొద్దు పడమరకు వాలింది. కూతేసి, గుప్పుగుప్పుమని పొగ వదలతా గస పోసుకొంటా వచ్చింది రైలు. బారెడు పొడుగు బుస వొదిలి పట్టాల మింద నిలబడింది.

రెడ్డి ఇచ్చిన చీటీని టెసన్లో చూపించినాను. రైల్లో వచ్చిన బొమ్మల్ని ఇచ్చి నా చేత ఏలిముద్దర ఏయించు కొనిరి. బొమ్మల్ని వరిగెడ్డిలో కుదించి గోనె సంచుల్లో మూట కట్టినారు. ఆ మూటల్ని బండిలో పెట్టుకొని యలబారినాను.

నరిసింగాపురంలో ఇద్దరు ఆడోళ్లు బండెక్కి నారు. ఒగామె ముసలిది, ముండమోపి. ఇంగొక ఆమె నడివయసుది. పుల్లయ్యగారి పల్లెలో దిగి తూటుదు గ్గాణి చేతిలో పెట్టినారు. రంగంపేటకు వచ్చేగుందికే బారెడు పొద్దు మిగిలింది.

మర్రిచెట్టు కింద బండిని నిలిపినాను. పల్లకిని చెట్టు కింద దింపి బోయలు అరువులు చేసుకొంటా వుండారు.

కల్లు అంగిట్లో కేళి ఇలాసంగా వుండాది. రంగం పేటలో తాటికల్లు బలే వుంటింది. రెండు దుత్తల కల్లు తాగి బండెక్కినాను. రంగంపేటలో వయసు పిలగాడు బాకరపేట దాక వస్తానని బండెక్కినాడు. వగిసిలో నా కంటే పెద్దోడుగానే వుండాడుగాని చూసేదానికి అట్లా కనిపించడం లేదు. మీసాలు తీసేసినాడు. తలకు రుమాలు సుట్టినాడు. వొళ్లు నిమ్మపండు సాయతోని నిగనిగలాడతా వుండాది.

*

బండి కదిలింది. జోడుగుర్రాల్లా ఎద్దులు అడుగు లేస్తా ఉండాయి.

నాగపట్ల చెరువులో చెరువుకోళ్లు 'బుడుంగు మని' మునగతా తేలతా వుండాయి. మెడలోతు నీళ్లల్లో మునిగిన చింతచెట్టు మింద కొంగలు వాలినాయి. చింతచెట్టు కొంగల్ని పూసినట్టు వుండాది. చెరువులోకి వొంగిన మోడాలు (మబ్బులు) వాటి నీడల్ని చూసు కొంటా వొళ్లు మరిసినాయి. వాలిపోయో పొద్దు చెరువు లో ఈత కొడతా వుండాది. బండిలో కూచ్చోనుండె నిమ్మపండు సాయ పిలగాడు చెరువు కోళ్లను, కొంగ లను, మబ్బులను, పచ్చనిచెట్లను చూసి మురిసిపోతా వుండాడు. ఎప్పుడూ చూడనట్లు ఇచ్చిత్తరంగా చూస్తా వుండాడు. నాకు నవ్వొచ్చింది.

చలి మేలుకొని వొళ్లు ఇంచుకొంటా వుండాది. నాగపట్ల చెరువు దాటుకోని ఎద్దులు అడవిలో అడుగు పెట్టినాయి.

మొగిలి కొండల్ని మేస్తా వుండాది. గుంపులు గుంపులుగా మబ్బులు తూరుపు నుంచి పడమరకు ఎగబడిపోతా వుండాయి. కొండల మింద కుచ్చోని అరువులు చేస్తా వుండాయి కొన్ని మబ్బులు. తెల్లగా మంచు మొగ్గలు చెట్లకు ఏలాడతా వుండాయి.

గువ్వలు అలలు అలలుగా ఎగిరిపోతా వుండాయి. అడివికి మేతకుపోయిన గొడ్లు ఊరి దారి పట్టినాయి. గొడ్లను మేపే పిలకాయలు చిక్కాలను సంకలో తగిలించుకుని ఆడతా పాడతా నడస్తా వుండారు.

సుగాలోళ్లు నెత్తి మింద కట్టెలమోపులను పెట్టుకొని నడుముల్ని కులికిస్తా కనందిగతా వుండారు. అద్దాల గౌను కుచ్చెళ్లు రంగులరాట్నం తిరగతా వుండాయి.

తెల్లదండు దిగుండాది. కల్లేటి (కళ్యాణి నది) వొంక గెడ్డన డేరాలు ఏసుకోని వుండారు. వొంక మింద తెల్లకొంగలు వాలినట్టు తెప్పల్లో తిరగతా చేపలు పడతా వుండారు. కొంతమంది తెల్లోల్లు బాట మీదకొచ్చి సుగా లోల్లను ఏడిపిస్తా వుండారు. ఒకరి మొగాలు ఒకరు చూసుకొని ఎలకపొండ్లు బయటపెట్టి కిసకిసా నగినారు.

తెల్లదండు దిగినప్పుడు పెద్దింటి ఆడోళ్లు ఆ పక్కకు పొయ్యేదానికి బయపడి చస్తారు. తెల్లోల్లను చూసి నన్ను గట్టిగా పట్టుకొన్నేడు నిమ్మపండు సాయ పిలగాడు.

''వాళ్లు మగోళ్లను ఏమీ అనరు. ఆడోళ్లతోనే సల్లాపాలు ఆడేది. ఏం బయం లేదులే,'' అన్నేను.

అయినా వాడు నన్ను వదలల్లేదు. వాళ్లను దాటు కొని పొయ్యేంతవరకు నన్ను బల్లి మాదిర్తో కరుసు కొన్నేడు. ఈపుకు ఎచ్చంగా గుచ్చుకొన్నేయి. నన్ను వదిలి పక్కకు జరిగినాడు. వాడికల్లా తిరిగి ఎగాదిగా చూసి నాను. వాడి కండ్లల్లో సీతాకోకచిలకలు రెపరెపలాడి నాయి.

కొండల మింద కుచ్చోనుండే మోడాలు కదిలి నాయి. పొద్దు బంగారం ముద్దయింది.

రంగుల్ని ఎవరో కళ్లాపి చల్లినారు.

''ఎవురు నువ్వు? ఎందుకు మగేసికం కట్టి నావు?'' అడిగినాను.

వులకలేదు, పలకలేదు.

''చెప్పాలనిపిస్తే చెప్పు. లేకపోతే వద్దులే,'' అన్నేను.

''నేను పోతుపాలెం పట్టపు దొరసానిని. నా పేరు రత్నమాల. సవడమ్మ తిరణాలకు పోతా వుండాను. కరకరా పొద్దు మొలిచినాక కోనేటిలో మునిగి ఆ నీళ్లతో సంతులేని ఆడోళ్లు దీపాలు ముట్టిస్తారు. ఎలిగిన దీపానికి సంతు కలిగితింది. ఎలగని దీపానికి సంతు కలగదు. నాకు పెండ్లయి పదేండ్లు అయింది. సంతు లేదు. ఎన్నో గుళ్లు, గోపురాలు, తీర్థాలు తిరిగినాను. ఇదే ఆకరు! ఎన్నాళ్లు గొడ్రాలు బతుకు బతికేది? దీపం ఎలగకపోతే గుప్పెడు పాణాన్ని ఆర్పేస్తాను.

''రంగంపేటకు వచ్చేగుందికే పొద్దుపోయింది. పల్లకీలో వస్తే తెల్లదండు మింద పడితింది. ఎట్లారా బగమంతుడా అడివి దాటేదని యసనపడి, దిక్కు తోంచక అల్లాడతా వుంటే దేవుని దూత మాదిర్తో వచ్చి నావు. సమయానికి ఆ దేవుడే నిన్ను పంపించినాడు.

''బోయవాడి దిరుసు ఏసుకొని బండి ఎక్కినాను. మాటలను బట్టి నువ్వు మంచివాడుగానే కనిపిస్తా వుండావు. నన్ను ఈ రాత్తిరికి అడివి దాటించి పున్నెం కట్టుకో. నీకు జీవితాంతం రుణపడి వుంటాను,'' అనింది. దొరసానినే చూస్తా వుండిపోయినాను.

''ఎందుకట్లా చూస్తా వుండావే,'' అనింది.

''ఒకరోజు మాయమ్మతో గూడా నగిరికి పొయి నాను. మా యమ్మకు దొరసాని పాత పట్టుకోకను బహు మానంగా ఇచ్చింది. మమ్మల్ని లోపలికి పోనీలేదు. కోట గుమ్మం కాడనే నిలబడినాము.

''అమా, అమా దొరసానులను చూసినావా? అని అడిగినాను. 'దొరసానులు దేవకన్నెకలు. మన బోటి వాళ్లకు కనిపించరు,' అని చెప్పింది.

''నాకు చిన్నప్పటి నుండి దొరసానులను చూడ ల్లని కోరిక. ఇప్పుడు వున్నెట్టు వుండి నిన్ను చూసే గుందికే నోటమాట రావడంలేదు. కలగంటున్నట్టు వుండాది,'' అన్నేను. పూలు రాలినట్టు పలపలా నగింది.

రెక్కల్ని ముడుసుకొని పొద్దు గూట్లో వాలింది. రంగులు ఎలిసిపోయినాయి. సీకటి చిక్కంగా అలుము కొంటా వుండాది.

చలి వొంటిమింద వాలింది. సనసన్నగా ఈదర గాలి వూలేస్తా వుండాది.

బండి పులిగుండు కాడికి వచ్చింది.

ఎద్దుల్ని విప్పి నీళ్లు తాపే దానికి వంకలోకి దిగినాను. మోకాలు లోతుకి దిగి ఎద్దులు నీళ్లు తాగతా వుండాయి. కొండల మద్దెన మెలికలు తిరిగి, కల్లేటి వంక రాళ్ల మింద గలగలా దరువేస్తా వుండాది. నీళ్లల్లో మిలమిలా చుక్కలు పొడిసినాయి. వొంకిరి చెంద మామ ఎన్నముద్ద మాదిర్తో నీటిమింద తేలతా వుండాది.

దొరసాని బండి దిగొచ్చి మోకాళ్ల మింద గొంతు కుచ్చోని నదిలోకి వంగింది. చేపపిల్ల మాదిర్తో అలల మింద తేలే వొంకిరి చందమామను దోసిట్లోకి తీసుకొ నింది. చెందమామ దోసిట్లోకి వచ్చినట్టే వచ్చి ఏళ్ల సందున జారిపోతా వుండాది.

ఎద్దులు నీళ్లు తాగి ఎనక్కు తిరిగినాయి. దొరసాని పైకి లేస్తా పట్టుతప్పి నీళ్లల్లోకి బొక్కబోర్ల పడింది. పగ్గాలను ఇసిరేసి నదిలోకి ఎగిరి దూకినాను. అలలు దొరసానిని లోపలికి నెట్టినాయి. వూపిరాడక 'బుడుంగు బుడుంగుమని' మునకలేస్తా వుండాది.

జుట్టు పట్టుకుందామనుకొనేసరికి రుమాలు జారిపోయింది. నల్లని బారడు పొడుగు కురులు నీళ్ల మింద పాయలు పాయలుగా తేలినాయి. నడుం పట్టుకొని బుజాల మిందకు వాల్చుకొన్నేను.

గెడ్డ మింద తెచ్చి కుచ్చన పెట్టినాను. మింగిన నీళ్లను కక్కేసింది. తామరదొన్నెలో నీళ్లు తెచ్చిస్తే మొగం కడుక్కొనింది. గుడ్డలు పిండుకొనేదానికి మద్ది మాను సాటుకు పోయింది. అలలు అలలుగా ఎన్నెల తొణికింది. నీటిలో చుక్కల వాన.

ఎద్దులు జమ్ములో మేస్తా వుండాయి. పంచె, పైగుడ్డ పిండుకొని కురుల్ని ఇదిలించినాను. పై గుడ్డతో తుడుసుకొని కురుల్ని రెండు పాయలుగా తీసి బుజాల మింద ఏసుకొన్నేను. దొరసాని పిండిన గుడ్డల్నే కట్టుకొని వచ్చింది. ఎద్దుల్ని పట్టుకొని ఇద్దరం బాటపైకి వచ్చినాం.

బండికి ఎద్దుల్ని కట్టినాను. దొరసానిని చక్రం మిందగా బండెక్కించి, నొగ మింద కుచ్చోని ఎద్దుల్ని అదిలించినాను. బండి పరుగునందుకొనింది. మబ్బుల్లో మునగతా, తేలతా వొంకరి చెందమామ పొడలు పొడ

లుగా బాట అడవిని సుట్టుకొనింది. బండి పోతా వుంటే వొంపులొంపులుగా తిరగతా వుండాది.

చానాసేపు మా మద్దెన మాటలు లేవు. దొరసాని చుక్కల ఆకాశాన్ని కండ్లల్లో నింపుకొనింది. ఎడమ బుజం మిందుగా ఎద పై కురుల్ని ఆరేసుకొనింది. ఆరిన కురులు గాలికి బుసపెడతా వుండాయి. తడి గుడ్డల్లో ముడుసుకొని గువ్వ మాదిర్తో కుచ్చొనింది.

"ఆడ వుడ్డగా వుండాయి సూడు చుక్కలు? అవి కోడిపిల్లలు. వుడ్డ ముందు వుండే చింతగింజంత చుక్క పిల్లలకోడి," ఏలుపెట్టి చూపించింది.

ఆకాశంలోకి సూపు సారించాను.

"అద్దో అవే మంచంకోల్లు. ఇక్కడ ఎక్కడ్నో రుషీ సురుడు మండలం వుండాల్నే!" ఆకాశమంతా కండ్లతో తారాడింది. మబ్బుల మాటున కనిపించలేదు.

గుప్పెట్లోకి చుక్కల ఆకాశాన్ని పట్టుకొనింది. తెరిసి చూసేగుందికే గుప్పెట్లో ఆకాశం లేదు.

"ఎంత పట్టుకొన్నే గుప్పెట్లో ఇమడదు. ఎంత ఎంచిన చిల్లర తరగదు. ఏందో చెప్పుకో?" కత ముడేసింది.

"ఎంత పట్టుకొన్నే గుప్పిట ఇమడనిది ఆకాశం. ఎంత ఎంచిన చిల్లర తరగనిది చుక్కలు," ఇప్పేసినాను.

"ఇంగొక కత! చల్లకుండలో ఎన్నముద్ద," ముడేసింది.

"ఎన్నెల కురిపించే చెందమామ," ఇప్పేసినాను.

"ఆ వొంకిరి చెందమామను తీసిస్తావా? తల్లో పక్కబిళ్లగా పెట్టుకొంటాను," అడిగింది. చెట్లకొమ్మల్లో దాగుడుమూతలు ఆడతా వుండాది వొంకిరి చెందమామ.

"ఎప్పుడూ సుక్కల్ని, చెందమామను సూడనట్టు మాట్లాడతా వుండావు," అన్నేను.

"పచ్చనిచెట్టును, ఎగిరే గువ్వను, ఎన్నెల కురిసే చెందమామను, చుక్కల్ని చూసి శానాళ్లైంది. ఎప్పుడో చిన్నప్పుడు మా నాయనవ్వ వొడిలో పడుకొని చూసినాను మల్లా ఇప్పుడు చూస్తా వుండాను," అనింది.

కల్లేటి వొంకరాళ్ల మింద దరువేస్తానే వుండాది. ఎద్దులు అలుపెరగకుండా నడస్తా వుండాయి. సన సన్నగా మంచు కురుస్తా వుండాది. చలి రానురాను ఎక్కువైంది. వొణుకు పుట్టింది.

కడుపులో ఆకలి రగులుకొనింది. రొట్టెల మూట ఇప్పినాను.

"మీబోటి దొరసానులు మాదిగల తిండి తింటారో తినరో?" అన్నేను.

"కాలే కడుపుకు అంటులేదు," అనింది.

రొండు సద్దరొట్టెలు ఇచ్చినాను. కొంచెం తుంచి నోట్లో ఏసుకొని కరుంగు కరుంగని నమిలింది.

"కమ్మగా వుండాయి. ఎన్నపూస రాసుకొంటే సప్పగా వుంటాయి," అనింది.

రొట్టెలు తిని సొరకాయ బుర్రలో వుండే నీళ్లు తాగినాము.

అతుకుల బొంత ఇచ్చినాను. కప్పుకొని మూగి చూసింది.

"అబ్బా బలే సలిగా వుండాది," చలికి గడగడా వణకతా రెక్కల్ని ముడుసుకొనింది.

"మురొగొబ్బు కొడతా వుండాది గదా?" అన్నేను.

"చలికి ఎచ్చంగా వుండాది," అనింది.

ఆరిన కురుల్ని మెడ మింద ముడేసి వదిలేసినాను. మంచు ఇరబోసుకొని దెయ్యంపట్టినట్టు వూగతా వుండాది. అడివంతా సద్దుమణిగింది. కొండకోనల్లో గణగణ గంటల మోత దొనిపలకత వుండాది. 'గీ' పెడతా కుమ్మరి పురుగులు అడివిని నిద్దరూపతా వుండాయి.

ఎన్నుపూస మింద పొడిపొడిగా మంచు కురుస్తా వుండాది. పైగుడ్డ కప్పుకొన్నే. చలాగలేదు. వొంట్లో సన్నగా వొణుకు. బీడీ ముట్టించుకుందామంటే సింగితంలో వుండే బీడి కట్ట అగ్గిపెట్టె తడిసిపొయినాయి.

దొరసాని కప్పుకొన్నె బొంత ఇచ్చింది.

"ఎండకూ, గాలికీ తిరిగినోడ్ని ఈ చలి ఒగ లెక్కా?" అన్నేను.

దొరసాని నవ్వింది.

బండి అక్కదేవతల కోనలోకి వచ్చింది. ఎద్దులు అడుగులో అడుగేస్తా నడస్తా వుండాయి. మంచు నిలిసి కురస్తా వుండాది.

*

ఆ రాత్తిరి మంచు వాన కురిసినట్టు కురిసింది. ఎద్దులు ముందుకు అడుగెయ్యలేకపొయినాయి. దావ జరగలేదు. అక్కదేవతల గెవిలో తలదాచుకొంటిమి. ఎవరో వులి, సుత్తి ఎత్తుకొని తొర్ర చేసినట్టుండాది గెవి. ఆ గెవిలో అక్కదేవతలు కొలువుంటారు.

గెవి ముందర పెద్ద యాపచెట్టు. చెట్టు కింద నిలువెత్తు పాముపుట్ట. దొంతులు దొంతులుగా పెరిగుండాది. ఎద్దులు తడిసిన వరిగడ్డిని మూగి సూడలేదు. పడుకొని నెమరేసుకొంటా వుండాయి. అలికిడికి బెదిరి ఉడతలు కొమ్మల మింద సరసరా పరిగెత్తుకొంటా, ఎగిరి కిందకు దుంకి పొదల్లో మాయమైనాయి.

ఎక్కడ్నో కొండ మింద నుంచి దెమదెమా జరి దూకే మోరుపు ఇనిపిస్తా వుండాది.

సలికి దొరసాని పాణం కిందమిందా అయిపో యింది. మంటేసుకొందామంటే చిదుగులు మంచుకు ముద్దగా తడిసిపోయినాయి. అరికాళ్లు, అరిచేతులు రుద్ది ఎచ్చజేసినాను. సుగంలేదు. ఎట్లయినా మంటేసు కోవాల్సిందే. లేకపోతే దొరసాని పాణంపోవడం ఖాయం.

బారతం బొమ్మలు మంటేసుకొందామని తీరు మానం చేసుకొంటి. మూటలు ఇప్పి బొమ్మల్ని బయ టకు తీసినాను. బొమ్మలకు కప్పిన వరిగడ్డి తడవలేదు. రెండు కనికిరాళ్లు తీసుకొని నిప్పు రాజేసినాను. వరిగడ్డి రగులుకొనింది. ద్రౌపతమ్మబొమ్మను మంటల్లో ఏసి నాను. లక్కపూత భగ్గుమని అంటుకొనింది.

మంట తగిలేగుందికే పాణాలు లేసొచ్చినాయి. దొరసానైతే మంటను అబ్బిలించుకొనింది. ఎలతర గెవంతా పడింది. అక్కదేవతల శిలలకు ఎప్పుడో పూసిన పసుపు కుంకాలు ఎండి రాలిపోయుండాయి. గెవిలో అందనంత ఎత్తున తేనెతుట్టె ఒగటి ఏలాడతా వుండాది. తేనెటీగలు జుమ్మని ముసురుకొని వుండాయి.

చలి కాంచుకొంటా దొరసాని అక్కదేవతల శిలల్ని చూసింది. ఆమె వొల్లు జల్లుమనింది.

వున్నెట్టుండి 'పెళపెళా' వురుమురిమి పక్కలో పిడుగు పన్నెట్టు పేటుమింద నుండి రాళ్లు దొల్లినాయి. గుండెకాయలు దడదడా అదిరినాయి. పాణాలు సల్లబడినాయి. దొరసాని వులిక్కిపడి బిత్తర చూపులు చూస్తా నన్ను అబ్బిలించుకొనింది.

రోమాలు నిక్కబొడుచుకొన్నేయి.

గప్పుడు గప్పుడన గిట్టెల శబ్దం. భీతి నుండి తేరుకొని మొనుసులోనే నవ్వుకొన్నేను. దొరసాని సన్నగా వణకతా వుండాది. గుండెదడ తగ్గనే లేదు.

"జింకల మంద బెదిరినట్టుండాది. జింకలు బెదిరితే రాళ్లురప్పలు పిండి అవ్వాల్సిందే," అన్నేను.

గప్పుడు గప్పుడని గిట్టెల శబ్దం గుండెల మింద నుంచి దూరమైంది. భీతి నుంచి తేరుకొనింది. అయినా నన్ను వదల్లేదు.

తల పైకెత్తి నన్ను చూసింది. దొరసాని కండ్లల్లో దగదగా ద్రౌపతి బొమ్మ మంటలు.

"మాదిగోడ్ని ముట్టుకొంటే మాకాపాతకాలు అంటుకొంటాయి," అన్నేను.

"అంటుకోనీలే నరకానికి పోతాను," అనింది.

విడుపించుకొని దూరంగా పొయ్యి నిలబడు కొన్నేను. కొండకోనల్లో నిరుశెబ్దంగా మంచు, ఎన్నెల కలిసి కురస్తా వుండాయి. కొండ మింద నుంచి దెమ దెమా జరిదూకే మోరుపు. అర్ధరాత్తిరి అడివిలో మేమిద్ద రమే. అలికిడిలేని అడివిని చూస్తా వుంటే బయంగా వుండాది.

వున్నెట్టుండి తెల్లారిపోతే బాగుండనిపించింది.

ఎనకనే వొచ్చి ఈపుమింద గెడ్డాన్ని ఆనించి చేతులతో చుట్టేసింది. మెడను వూపిరి కాల్చేస్తా వుండాది. రొమ్ముల ఎచ్చదనం కలగలిసిన ఆడవాసన మైకం కమ్మింది. తట్టుకోలేక పోయినాను. గబుక్కున తిరిగి దొరసానిని కావిలించుకొన్నేను.

పూలను తీసుకొన్నెట్లు చెంపల్ని చేతుల్లోకి తీసు కొనింది. నన్ను కండ్ల నిండా నింపుకొనింది.

"నాకు చుక్కలాకాశాన్ని తెంపిస్తావా?" మెడ సుట్టూ చేతులేసి అడిగింది.

బుగ్గల్ని దోసిట్లో అదుముకొని నుదిటిమింద ముద్దు పెట్టుకొన్నేను. వొళ్లంతా పులకింత. పువ్వులో సనసన్నని వొణుకు.

"అబ్బా! నీ ఎద ఎంత ఎత్తుండాది. పురులు తిరిగిన కండల్ని చూస్తా వుంటే పిచ్చెక్కతా వుండాది," ఎదను మునిపంటితో కొరికింది. చేతులతో వొళ్లంతా తడిమింది. వొంటిని కొండచిలవ పాము సుట్టుకొనింది.

ఆకాశంలో వొంటరి కొంగ వొకటి అడివిని ఈదతా వుండాది. ఆడాడ మబ్బులు నిద్దర మైకంలో తూగతా వుండాయి.

యాపచెట్టు కొమ్మల్లో తొంగితొంగి చూస్తా వొంకిరి చెందమామ. ధర్మరాజుల బొమ్మను మంట లోకి ఇసిరినాను. చిటపటా మినగరలు వేసినాయి.

చుక్కలాకాశాన్ని తెంపి దోసిట్లో పోసినాను. బారతం బొమ్మలు కాలి బూడిదైనాయి.

తూరుపున పటమెగరక ముందే బాకరపేటకు చేరినాము. అని కత చెప్పడం ముగించినాడు ముసి లోడు.

"మల్ల ఆ దొరసాని ఏమైంది తాత?" అడిగినాడు మనవడు.

"తెల్లారితే ఏముండాది. ఆమె దొరసాని, నేను మాదిగోడ్ని. ఎవరి దారి వాళ్లది. బండి దిగిపొయ్యే టప్పుడు ఒగసారి తిరిగి చూసింది. కండ్ల నిండుకు నీళ్లు వుండాయి.

ఒగ ఎరికలసానికి దొరసాని ఆనవాళ్లు చెప్పి ఈ పచ్చబొట్టు పొడిపించుకొంటిని, అని చెప్పినాడు.

"మల్లెప్పుడూ ఆ దొరసానిని నువ్వు చూల్లేదా తాత?" మనవడు అడిగినాడు.

"రెడ్డికి అడివిలో జరిగిందంతా చెప్పలేదు. అడివిలో వాన కురిసినట్టు మంచు కురిస్తే, బారతం

బొమ్మల్ని మంటేసుకొని పాణాలు కాపాడుకొన్నేనని చెప్పినాను.''

''వూరు వొదిలిపొమ్మని శిచ్చ ఏసినాడు. మాయమ్మను పిలుసుకొని, దేవుని మింద బారమేసి ఈ గుత్తి రాజ్యానికి వచ్చేసినాను. మల్ల నేను ఆ పక్కకే పోలేదు. దొరసాని ఏమైందో ఏమో నాకు తెలవదు,'' అని చెప్పినాడు.

*

వాన ఎలిసింది. గొడ్లు మర్రిచెట్టు కింద నుండి కదలబారినాయి. తాత మనవడు గుడ్డలు ఇదిలించు కొని పైకి లేసినారు. రెక్కల్ని రెపరెపలాడించినాను. మనవడు నన్ను చూసినాడు. చేతుల్లోకి తీసుకొని తాతకు చూపించినాడు.

''అరరే చిలక రెక్కకు దెబ్బ తగిలిందే,'' అంటా నన్ను తీసుకొని నెత్తురు తుడిసి, ఏవో ఆకుల పసరు పిండి రెక్కకు కట్టు కట్టినాడు.

''నొప్పిగా వుండాదా బుజ్జీ? తాత కట్టు కట్టినాడు గదా తగ్గిపోతుందిలే,'' నన్ను వొళ్లోకి తీసుకొని ముద్దు పెట్టుకొన్నాడు మనవడు.

కొంచెంసేపటికి చేత్తో తీసేసినట్టు నొప్పి తగ్గింది.

పొద్దు గూట్లో పడింది. గొడ్లను కమ్మనాయుడి దొడ్లో తోలేసి మాదిగపల్లెకు చేరినాము. మేము ఇంటికి పొయ్యేగుందికే పొయిమింద కుతకుతా గొడ్డు తునకలు వుడకతా వుండాయి. వాసన గమగమా ముక్కుల్ని తాకింది.

ఆ పొద్దు మద్దేన్నం కొమ్ములు తిరిగిన ముసిలెద్దు ఒగటి సచ్చి పూడిసింది. ఇంగేముండాది మాదిగ పల్లెలో పండగే గదా! పెద్ద భాగం ముసిలోడు వాళ్లదే. గుల్లడు తునకలు ఇచ్చినారు. పచ్చి తునకలకు పసుపు పూసి గోగునారకు కూర్చి దండేనికి ఏలాడదీసి వుండారు. తడికల మింద పేగుల్ని ఆరేసినారు. ఇల్లంతా పచ్చి తునకల మదపోసన కొడతా వుండాది.

నా కోసరమని వోటు కుండలో వరిగడ్డి పరిసి గూడు అల్లినాడు మనవడు. మెత్తని మేపులన్నీ తెచ్చి పెట్టినాడు. రోజూ పుండు తుడిసి కట్టు మార్చేవోడు. నన్ను ఎంతో ముదిగారంగా చూసుకొన్నేడు. వారం దినాలకు రెక్కాడించగలిగాను. అప్పుడే కాకితో సావాస మైంది.

అవి మాదిగిండ్లు గదా! దండెం మింద ఏలాడ దీసిన కండల కోసరంగ కాకి వస్తా పోతా వున్నింది. తొట్టతొలి చూపు చూపు కలిసింది. తర్వాత మాట మాట కలిసింది. మల్లేముండాది ముక్కల దాక ప్రేమలో పడి పోయినాము.

మేమిద్దరం ప్రేమించుకొంటా వుండామని తెలిసి నన్ను వదిలెయ్యమని ముసిలోడు మనవడికి చెప్పి నాడు. వొళ్లంతా ముద్దు పెట్టుకొని నన్ను వదిలేసినాడు. నాకు దుక్కమొచ్చింది.

వాళ్ల దెగ్గిర సెలవు తీసుకొని కాకి, నేను యల బారి వచ్చేసినాము. పెంచల కోనలో కాపరం పెట్టి నాము. ఒకర్ని ఇడిసి ఒకరు గడిసేపు వుండేవాళ్లం గాదు. పొద్దు పుట్టేది, పొద్దు గూకేది తెలిసేది కాదు. కాకి చెంత సొర్గ సుఖాలను అనుబోగించినాను.

కొండల్లో, కోనల్లో రెక్కా రెక్కా రాసుకొంటా ఎగిరి నాము. వాగుల్లో, వంకల్లో నీళ్లు జల్లుకొంటా మునక లేసినాము. పూలపొదల్లో ఎన్నో వూసులాడుకొంటిమి.

ఇసిక పరుపుల మింద ఎన్నెల్లో జతకట్టి ఎన్ని సార్లు వొళ్లు మరిసినామో!

కన్ను మూసి, కన్ను తెరిసేంతలో కమ్మని కల కరిగి పూడిసింది. ఒగరోజు గాలీవానా వచ్చింది. మేము వాలిన చెట్టు కూలింది. నేను పాణాలతో బయటపడి నాను. కొమ్మల కింద నుజ్జునుజ్జయి కాకి పాణ మిడి సింది. బొరోమని ఏడ్సినాను. సొర్గం అందినట్టే అంది నేల రాలిపోయింది. కొన్ని దినాలు మనేదతో కుంగి పోయినాను. వొంటరి బతుకు ఎన్నాళ్లు బతికేది సచ్చి పోదామని తీరుమానం చేసుకొంటి.

అప్పుడే ఈ పసిగుడ్డు కడుపులో పడింది. మల్లా బతుకు మింద ఆశ కలిగింది. వొంటరిగా రెక్కలల్లార్చు కొంటా ఎగిరినాను. ఎగిరినాను. ఒగ దావంటూ లేక పాయ నాకు.

''ముక్కేటికాడ ఈ సాదుచిలక తోడు పడింది. అది నన్ను మల్లా మీ గుంపులోకి చేర్చింది. ఇది జరిగిన కత. కాకితో సావాసం చేసినందుకు కాకిపిల్ల పుట్టింది,'' అని కతంతా పూసగుచ్చినట్టు చెప్పింది పెంటి చిలక.

*

పెంటి చిలక చెప్పిన కతను మిగతా చిలకలన్నీ చెవులు నిక్కబొడుచుకొని ఇన్నేయి.

''ఎంత కత నడిపినావే లంజదానా! నిన్ను నిలువునా నరికినా పాపం లేదు,'' కాకరించి మొగాన వూచింది, కోటారిస్తా కాళ్లను ఇదిలించింది పోతు చిలక.

పెద్ద చిలక కుచ్చును కాలితో దీడుకొనింది.

''ఆ యమ్మి చెప్పిన కతంతా అందరూ ఇన్నేరు కదబ్బా? కాకితో సావాసం చేసి జతగూడినానని వొప్పు కొనింది. ఈడ చానామంది నాకంటే పెద్దోళ్లు, సదువు కున్నోళ్లు, లోకం తిరిగి నాలుగు వూర్లు చూసినోళ్లు వుండారు. వాళ్ల ముందు నేనెంత? మీరైతే ఏం చేస్తారో

చెప్పండి,'' తెలివిగా ముందే అడ్డుపుల్ల ఏసింది పెద్ద చిలక.

ఆడవుండే చిలకల్లో ఎవురికీ పెద్ద చిలక ముందుర నోరు తెరిసే ధైర్నం లేదు. తెరిసినా పెద్ద చిలక పక్కనే మాట్లాడతాయి.

నడివయసులో వుండే చిలకొకటి పైకి లేసింది.

''దేవరా! మీరు రాజాతిరాజులు. అన్ని తెలువులూ వున్నోళ్లు. మీకు చెప్పాల్సిన పనిలేదు. ఈ పెంటి చిలక కాకితో జతకూడి మన చిలకజాతికే చెడ్డ పేరు తెచ్చింది. కాకి కడజాతిది. సచ్చిన గొడ్లను పొడుసుకొని తింటింది. ఎద్దు పుండు కాకికి ముద్దగాదు. చిలకకు కాకిపిల్ల పుట్టిందని తెలిస్తే లోకం పకపకా నగితింది. కాకరించి వుమ్మేస్తింది. పొద్దుగూకతా, పొద్దు మొలస్తా వుండాదదంటే, నెత్తి మింద ఆకాశం నేల రాలకుండా వుండాదంటే ధర్మం తప్పనందుకే! ఈ పొద్దు పెంటి చిలక ధర్మాన్ని కాలతన్నింది. జన్మజన్మలకు గుర్తుండేట్టు పెద్ద శిచ్చ ఎయ్యాల దేవరా!'' అని గొంతు చించుకొనింది.

''ఇదెక్కడి నాయం దేవరా? ధర్మం నేనొక్కదాన్నే తప్పినానా? చిలకల ముడ్డి కింద ఎన్ని మచ్చులుండాయో ఒగసారి వొంగి చూసుకొంటే తెలిస్తింది. గోరువంకలతో జతకూడడం లేదా. అది తప్పుగాదా? నేను కాకితో జతకూడినప్పుడేనా ఆకాశం రాలి కింద పడతా వుండేది,'' గద్దించి అందర్నీ నిలదీసింది పెంటి చిలక.

చిలకల మొగాలు నల్లగా మాడిపోయినాయి. సదువుకొని తెలవిమీరిన చిలకగొకటి పైకి లేసింది.

''దేవరా! శానా రాజ్జాలు తిరిగుండాను. ఎన్నో వింతలు, విశేషాలు చూసినాను. కాకితో చిలక జతకూడిన ఇచ్చిత్తరాన్ని ఇక్కడ్నే చూస్తా వుండాను. మహామహా కవులే గోరింకలతో జతకూడిన వైనాన్ని కైగట్టి వుండారు. చూడముచ్చటగా వుండే జంటను చిలకా గోరింకా అంటారుగాని, కాకి చిలకా అని పిలవరు. అది సృష్టికే విరుద్ధం. గోరింకలది ఉత్తమమైన జాతి. ఇవన్నీ మీకు తెలవకపోలేదు. మీ తీర్పు ఎటువంటిదైనా మేమందరం శిరసావహిస్తాం,'' పెంటి చిలకను తెలివిగా దెబ్బకొట్టినందుకు మురిసిపోతా కుచ్చొనింది.

పెద్ద చిలక అందరి వాదనలు ఇని గొంతు విప్పింది.

''మీకందరికీ తెలుసు నాయమేదో, అన్నాయమేదో! వుప్పు తిననివాడు, తప్పు చేయనోడు ఈ పెంపంచంలో లేడు. పెంటి చిలక కాకితో జత కట్టడం తప్పే. తప్పులు అందరూ చేస్తాం. చేసిన తప్పును కొందరే దిద్దుకొంటారు. అందుకని పుట్టెడు సున్నంలో కాకిపిల్లను ఇడగబోసి ఆ యమ్మి చేసిన తప్పును సరిదిద్దుకోవల్లని తీర్పు ఇస్తా వుండాను. అందరికీ ఆమోదమేనా?'' అందర్నీ అడిగింది పెద్ద చిలక.

''సెలవే సెలవే,'' అని అరిసినాయి చిలకలన్నీ! కొంటె చిలకలు కొన్ని వూలలేసినాయి. రెక్కల కింద కాకిపిల్ల వులికిపడింది.

''ఎన్నో దేవుళ్లకు మొక్కుకొన్నేను. చిలకతో నాకు సంతు కలగలేదు. గొడ్డుబోతురాలునని లోకం కోడై కూసింది. కాకితో జత కూడితే సంతు కలిగింది. తల్లినైనాను. ఇంగా కండ్లు కూడా తెరవని పసిగుడ్డు. దానికి ఏ పాపం తెలవదు. నన్ను సున్నంలో ఇడగబోసి తప్పు దిద్దండి. నీ కాళ్లకు దండం పెడతాను. నా బిడ్డను చంపొద్దు దేవరా!''

పెద్ద చిలక కాళ్లమింద పడి బొరోమని ఏడిసింది.

దాని కంటినీరు పెద్ద చిలక మొనుసును కరిగించలేకపోయింది.

''చూడమ్మీ నా చేతుల్లో ఏమీలేదు. అందరి వాదనలు ఇని ఇచ్చిన తీర్పు ఇది. దీనికి తిరుగులేదు,'' పెద్ద చిలక పైకి లేసింది.

చిలకలన్నీ రెక్కల్ని రెపరెపలాడించి పైకి లేసినాయి.

పుట్టెడు సున్నం తెచ్చి ఇడగబోసినాయి. పొయి మింద బానలో సున్నం కుతకుతా వుడకతా వుండాది. చిలకలు పొయ్యి సుట్టకారం గుంపు కట్టినాయి.

పెంటి చిలక గోడుగోడున ఏడస్తా వుండాది. లబలబా నోరు కొట్టుకొంటా వుండాది. పెంటి చిలక సోకానికి దిక్కులు దొని పలకతా వుండాయి. కాకిపిల్లను కాళ్లల్లో తన్నుకొని పైకి ఎగిరింది పోతు చిలక. 'కీసు కీస'ని కాళ్ల సందున కాకిపిల్ల అరస్తా వుండాది.

పొగలు కక్కే సున్నంలో కాకిపిల్లను వదిలేసింది.

''ఓయమ్మల్లా,'' అంటా బీతరుపు అరిసి తెలివి తప్పింది పెంటి చిలక.

చిలకలన్నీ కేకలు పెట్టినాయి. అరిసినాయి. వూలలేసినాయి. పొయి సుట్టకారం ఎగిరెగిరి అలిసి పోయినాయి.

తన్నుకొని తన్నుకొని, తూరుపున నెత్తురు కక్కోని చుక్కలాకాశం పాణమిడిసింది.

*ఆదివారం వార్త, 17 అక్టోబర్ 1999*